
ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024
5
శ్రీ సత్యసాయి





పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న కార్మికులు

సడలని మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటితో 13వ రోజుకు చేరుకుంది. కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి నరసింహులు మాట్లాడుతూ కార్మికులు సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, గోవిందు, పెద్దన్న, నాగార్జున, సాయి, రామయ్య, సరోజమ్మ, నారాయణమ్మ, రామక్క, గంగమ్మ పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణ పరిశుభ్రత కోసం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. వీరికి నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ రమేష్‌కుమార్ మద్దతు తెలిపారు. టిడిపి ప్రభుత్వం రాగానే వీరి సమస్యల పరిష్కరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప, నాయకులు మంగేష్, కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, గురునాథం, ఆనంద్, కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు పట్టణంలోని గాంధీసర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడే మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని ఎఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హెచ్చరించారు. వీరికి ఆంజనేయులుతో పాటు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెవి.రమణ, ఎపి చేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వెంకటనారాయణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పోలా లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ సలహాదారు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబులేసు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు అడ్రా మహేశ్, ప్రధాన కార్యదర్శి బొగ్గు నాగరాజు, సహాయ కార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరి సురేశ్, అంకే పెద్దన్న పాల్గొన్నారు.

పెనుకొండ : సమస్యల పరిష్కారం కోసం నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 13వ రోజైన ఆదివారం కొనసాగింది. నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్, మండల కార్యదర్శి బాబావలి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు చిన్న వెంకటేష్, రిక్షా నరసింహులు, ముత్యాలు, నరసింహప్ప, తిప్పన్న, లక్ష్మీదేవి, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి కంచుకోటపై వైసిపి కన్ను



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హిందూపురం నియోజకవర్గానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. టిడిపి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఓటమి ఎరుగని కోట ఏదైనా ఉంది అంటే అది హిందూపురం నియోజకవర్గం అని చెప్పవచ్చు. అయితే ఈసారి జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా కంచుకోటపై వైసీపీ జెండా ఎగురవేయాలన్న సంకల్పంతో వైసీపీ రాయలసీమ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నియోజకవర్గంలో పట్టణం నుంచి పంచాయితీ వరకు కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరినీ కలవనున్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇప్పటికే నియోజకవర్గంలో మాకాం వేశారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు హిందూపురం పురపాలక సంఘం, రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీంతో హిందూపురం నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

◆ ఎన్నికల్లో మంత్రి పాచికలు పారేనా..!

◆ నేటి నుంచి నియోజకవర్గంలో పెద్దిరెడ్డి ఆరు రోజులు, బాలయ్య మూడు రోజుల పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పెట్టని కోటగా ఉంటున్న హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థులే గెలుపొందుతూ వస్తున్నారు. దీంతో త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార వైసిపి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక నాయకుల్లో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరడంతో అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. తెలుగుదేశం పార్టీని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎవరు ఓడిస్తారన్న కోణంలో కూడా తాజాగా అధికార పార్టీ సర్వేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇకపోతే 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి నందమూరి బాలకృష్ణ చేతిలో 14 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన నవీన్ నిశ్చల్ వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు సాగించారు. ఇందులో భాగంగా విజయవాడలోనే మకాం వేసి టికెట్ కోసం జోరుగా ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ప్రస్తుత సమన్వయకర్త దీపిక అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది. మైనార్టీలకే టికెట్ దక్కేలా పావులు కదిపి వైసిపి సీనియర్ నాయకుడు కట్లబాషా పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. దీనికి తోడు మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాం రెడ్డి కూడా టికెట్ కోసం తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మళ్లీ నందమూరి బాలకృష్ణనే ఇక్కడి నుండి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయనకు ధీటుగా ఎవరిని బరిలోకి దింపాలన్న కోణంలో వైసిపి అధిష్టానం దృష్టిసారించినట్లు సమాచారం. ఓవైపు పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రస్తుత మంత్రి ఉషశ్రీ చరణ్ పోటీ చేస్తున్నట్లు స్పష్టం కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికకు ఇస్తారా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సత్యసాయి జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మహిళలకు అసెంబ్లీ టికెట్లను ఇచ్చే అవకాశాలు ఉంటాయా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. 1983 నుండి స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం తరపున టిడిపి అభ్యర్థులే విజయం సాధిస్తున్న నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2024 ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. 1983లో టిడిపి అభ్యర్థి రంగనాయకులు, 1984లో జరిగిన ఉప ఎన్నికల్లో 1999, 1904 సాధారణ ఎన్నికల్లో టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ఘన విజయం సాధించారు. ఎన్టీఆర్ మరణానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన తనయుడు నందమూరి హరికృష్ణ భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2004 అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల్లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హవాలో సైతం స్థానిక టిడిపి అభ్యర్థి పామిశెట్టి రంగనాయకులు విజయం సాధించగా 2009 ఎన్నికల్లో కూడా టిడిపి అభ్యర్థి అబ్దుల్ ఘనీ విజయం సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా ఇక్కడ మాత్రం టిడిపి అభ్యర్థులే గెలవడం గమనార్హం. 2014, 2019 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ విజయం సాధించారు. టిడిపికి ఓటమి లేని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎలాగైనా పట్టు సాధించాలని తాజాగా వైసిపి అధిష్టానం ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. అయితే పార్టీలోని స్థానిక నాయకుల్లో నెలకొన్న గ్రూపు తగాదాలు పార్టీ అధిష్టానానికి తలనొప్పులు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలో గ్రూపు తగాదాలపై తాజాగా అధిష్టానం దృష్టి సారించింది. ఇప్పటికే దీపికను అభ్యర్థిగా అధిష్టానం పరోక్షంగా ప్రకటించినప్పటికీ కొందరు టికెట్ల కోసం ప్రయత్నాలను చేస్తున్నారు. నందమూరి బాలకృష్ణకు ఎవరు గట్టి పోటీ ఇస్తారన్న కోణంలో కూడా తాజాగా సర్వే చేస్తున్నట్లు సమాచారం. అయితే రీజినల్ కోఆర్డినేటర్, సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా జోక్యం చేసుకొని టిఎన్ దీపికను హిందూపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అభ్యర్థి మార్పు అంత సులభంగా ఉండదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఓటమి ఎరుగని కోటలో వైసిపి ఏస్థాయిలో ఢీకొడుతుందో వేచిచూడాలి.

ఐక్యంగా కలిసి వస్తారా..?

నాడు కాంగ్రెస్ పార్టీ.... నేడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ విభేదాలతోనే హిందూపురం నియోజకవర్గ టిడిపికి కంచుకోటగా మారింది. అయితే నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రూపులను ఒకే తాటిపైకి తీసుకురావాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేస్తున్న పాచికలు పారుతాయా లేదా అన్న వ్యాఖ్యానాలు రాజకీయ విశ్లేషకుల్లో వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నుంచి మండలానికి రెండు రోజుల చొప్పున కేటాయించి ఆరు రోజులపాటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గత 20 రోజుల నుంచి మంత్రి వ్యక్తిగత కార్యదర్శి తో పాటు చిత్తూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు నియోజకవర్గంలో ఉన్న నేతలందరినీ కలిశారు. వారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంత్రి తన పర్యటనను ఖరారు చేసుకున్నారు. అయితే దీపిక అభ్యర్థిత్వాన్ని పార్టీ సీనియర్ నాయకులు, ఏపీ అగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ తో పాటు ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఇతర ముఖ్య నేతలు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీలో ఉన్న నేతలందరూ ఐక్యంగా కలిసి వస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రి ఎదుట అందరూ కలిసి వచ్చినప్పటికీ ఎన్నికల సమయంలో కలిసి వచ్చి పని చేస్తే మంత్రి పాచికలు పారే అవకాశం ఉంది.

పురంలో వేడెక్కిన రాజకీయం

ఒకపక్క స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మరోపక్క అధికార పార్టీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనుండటంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. పట్టు నిలబెట్టుకోవాలని బాలకృష్ణ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నారు. మరోపక్క మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో ఉన్న గ్రూపులు అన్నింటిని ఒకే తాటిపైకి తెచ్చి ఎలాగైనా పట్టు సాధించాలని ముందుకు సాగుతున్నారు. దీంతో ఇప్పుడే నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం నెలకొంది.



హిందూపురం అసెంబ్లీ పరిధి చిత్రపటం

ఎస్ఎస్ఎ ఉద్యోగులపై మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సర్వ శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, సర్వ శిక్ష ఉద్యోగుల సంఘం శ్రీ సత్యసాయి జిల్లా జేఏసీ అధ్యక్షులు ఓబిరెడ్డి కోరారు. 19వ రోజు సమ్మెలో భాగంగా విద్యాశాఖ సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబిరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖలో గత 20సంవత్సరాల నుండి పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరి విడనాడాలని, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఆలోచించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ సమగ్రశిక్ష రాష్ట్ర పథక అధికారి శ్రీనివాసరావు ఉద్యోగుల పట్ల అవలంభిస్తున్న తీరు సరిగా లేదన్నారు. ఉద్యోగులపై బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ఆయన తీరు ఇలాగే ఉంటే మరొక్కసారి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రామన్న, రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు చంద్రశేఖర్ , నాగరాజు, ఓబులేసు, బాబ్జాన్, హరిప్రసాద్, భవాని, స్రవంతి, ఈశ్వరి, భాగ్యమ్మ, ఆనంద్, రాజశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఎస్‌టియు

19 రోజులనుంచి న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారానికి చొరవ చూపకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమని ఎస్టీయూ స్టేట్ కౌన్సిల్ నెంబర్ కోనంకి చంద్రశేఖర్ విమర్శించారు. వెంటనే వారితో చర్చలు జరిపి సమ్మెను విరమించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. స్థానిక మేళాపురంలోని దీప్తి పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కమిషనర్‌తో పాటు ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, పాఠశాల కరస్పాండెంట్ అబ్రహం కుట్టియాంకల్, జేవీవీ జిల్లా కార్యదర్శి ఆదిశేష, రామకృష్ణ, ఈటీ రామ్మూర్తి హాజరై మాట్లాడారు. మూఢనమ్మకాలు ప్రగతికి అవరోధాలని, కావున విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. ట్యాలెంట్ టెస్టులో బిఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల(ధర్మవరం) విద్యార్థులు ఈశ్వర్, ఓబులేసు, నగేష్ కుమార్, ప్రయివేటు పాఠశాలల విభాగంలో ఒడిసిలోని రెయిన్‌బో హైస్కూల్ విద్యార్థులు యశ్వంత్‌నాయుడు, లయశ్రీ, మేఘనాథ్ విజేతలుగా నిలిచారు. రు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు వెంకటరామిరెడ్డి, నారాయణస్వామి, రామకృష్ణ, శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, ఉగ్రప్ప, అంజనారెడ్డి, బాలగంగాధర్ తిలక్, హరి, ఓబులేసు, మురళీమోహన్, ఇమ్రాన్‌బాషా పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జెవివి నాయకులు

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి జిల్లాలో ఎన్నికలు నిర్వహణ పారదర్శకంగా జరగడానికి తగిన చర్యలు తీసుకుందామని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులతో పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాలోని నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎన్నికలు నిర్వహణపై ఈనెల 9,10 తేదీలలో విజయవాడలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లతో కేంద్ర ఎన్నికల కమిషన్ సమావేశం నిర్వహిస్తోందన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాబోవు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రవికుమార్, డిఆర్ఒ కొండయ్య, ఆర్‌డిఒలు భాగ్యరేఖ, రమేష్ రెడ్డి, వంశీకృష్ణ, ఈఆర్వోలు పాల్గొన్న ఈ సమావేశంలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఓటర్ జాబితా వివరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకాలు, ఇవిఎంల గోదాములు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, వసతుల కల్పన, సమస్యాత్మక గ్రామాల గుర్తింపు తదితర విషయాలను కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై రైతుల ఆసక్తి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్





ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల పెంపకంపై రైతులు గత పది సంవత్సరాల నుండి ఆసక్తి చూపుతున్నారు. గతంలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు సంవత్సరాల నుండి భూగర్భజలాలు అభివృద్ధి చెందుతున్న తరుణంలో రైతులు పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. దానికి తోడు ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: పండ్ల తోటలసాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?

జవాబు: అతివృష్టి అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ పండ్ల తోటల పెంపకానికి సహకరిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. వీటి సంరక్షణకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. మొదటి దశలో గుంతలు తీయడానికి, మొక్కలు నాటడానికి, మూడు సంవత్సరాల సంరక్షణకు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు మంజూరు చేస్తున్నాము. దీంతో ఎక్కువ శాతం మంది రైతులు పండ్ల తోటల పెంపకం పై మక్కువ చూపుతున్నారు.

ప్ర : పండ్లతోటల పెంపకం కోసం రైతులకు ప్రభుత్వము ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పిస్తోంది ?

జ: పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను అందిస్తోంది. వాటిలో బోరు బావులు త్రవ్వకం, రైతులకు డ్రైలాండ్, హార్టికల్చర్, పథకం ద్వారా మామిడి మొక్కలు సాగు చేస్తే మొక్కలకు నీటిని అందించడానికి ఎరువులు తదితర వాటి కోసం మూడేళ్ల పాటు ఎకరాకు రూ. 1,3,193ల రాయితీ అందిస్తుంది. బోరు బావులు ఉన్న రైతులకు చీనీ మొక్కలు సాగు చేసుకుంటే రాయితీ అందిస్తోంది. జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం తదితర పండ్ల తోటల సాగుకు రాయితీలు విరివిగా ప్రభుత్వం అందిస్తోంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్ర : పండ్ల తోటల రైతులకు ఏయే పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు?

జ: సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరములో కురిసిన వర్షాలకు 255 హెక్టార్లలో పండ్లతోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. అత్యధికంగా కాయగూరలు పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ. 15వేలు, అరటికి రూ. 25 వేలు, మామిడికి ఎకరాకు రూ. 20 వేలు, నారింజ, దానిమ్మ, చీనీ, కాయగూరలు పంటలకు రూ.15వేలు, కొత్తిమీర పంటకు ఎకరాకు రూ, 7200లు నష్టపరిహారం రైతులకు అందించాం.

ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులకు ఏ విధంగా ఆదుకుంటున్నారు?

జ: పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల నుండి ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలు ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. వీటికి తోడు డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు ,పైపులు సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం.

బెదిరింపులకు బెదరం

జిఒ-2 ప్రతులు దహనం చేసి అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమ్మెలో భాగంగా 27వ రోజైన ఆదివారం అంగన్వాడీలు జిల్లా వ్యాప్తంగా ఎస్మా, జిఒ-2 ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, ఉద్యోగాల నుంచి తొలగించినా సమ్మెను విరమించబోమన్నారు. కనీస వేతనం, గ్రాట్యుటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ తక్షణమే జీవో జారీ చేస్తే సమ్మెను విరమిస్తామన్నారు. దీక్షలో కదిరి, నల్లచెరువు ప్రాజెక్టుల నుంచి వకుల లక్ష్మీదేవి, సల్మా, భారతి, ఆదిలక్ష్మమ్మ, భాగ్యమ్మ, నీలిమ, సరస్వతి, పద్మావతి, ఈశ్వరమ్మ, అశ్విని, సుశీల పాల్గొన్నారు. వీరికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా కోశాధికారి సాంబశివ, జిల్లా ఉపాధ్యక్షులు జివిల్ నరసింహులు, పంచాయతీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి రమేష్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెడవల్లి బాబా, వేమన్న, రామకృష్ణ, ఎస్టియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. దీక్షలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా కోశాధికారి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు ఉషారాణి, లక్ష్మీదేవి, లావణ్య శోభారాణి పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం సిగ్గుమాలిన చర్య అని సీఐటీయూ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అంగన్వాడీ ఉద్యమం అణచివేత కోసమే తెచ్చిన జీవో-2ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి జిఒ ప్రతులను దహనం చేశారు. సంక్రాంతిలోగా ఎస్మా ప్రయోగం వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, శిరీష, ఆయేషా, రిహానా, పద్మ, నాగమ్మ, శైలజ పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమ్మె విరమింపజేయాలని ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా జిఒ-2 కాపీ ప్రతులను అంగన్వాడీలు దహనం చేశారు. సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలను కొనసాగించారు. వీరికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకుడు ఎస్.చాంద్‌బాషా, సిఐటియు మండల అధ్యక్షుడు ఎల్.ఆదినారాయణ మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు.




హిందూపురం, ధర్మవరంలో జిఒ-2 ప్రతులు దహనం చేస్తున్న అంగన్వాడీలు

ఓబుళదేవరచెరువు : సమ్మెలో భాగంగా ఒడిసి, అమడగూరు మండలాల అంగన్వాడీ సిబ్బంది ఎస్మా జిఒ-2 కాపీ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షులు కుళ్లాయప్ప సంఘీభాం తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ యూనియన్ లీడర్లు కిష్టమ్మ, పద్మ, మణిమాల, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు ఎస్మా, జిఒ-2 ప్రతులను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిగి సెక్టార్ పద్మ, సిఐటియు లింగారెడ్డి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్వాడీలు విప్లవ గీతాలు పాడి నిరసన వ్యక్తం చేశారు. శిబిరాన్ని సిఐటియు, సిపిఎం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షలో సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, బండల వెంకటేశు, ప్రజానాట్యమండలి నాయకుడు బాబు, రజియా పాల్గొన్నారు.

లేపాక్షి : ఎస్మా ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక ప్రధాన కూడలిలో ఉత్తర్వుల ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, ధనమ్మ, పార్వతి, మాధవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పెనుకొండ : జిఒ-2 రద్దు చేయాలని నినాదాలు చేస్తూ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద జిఒ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని తప్పుపట్టారు. 11 డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

చిలమత్తూరు : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు ఎస్మా జిఒ-2 ప్రతులను సిఐటియు ఆధ్వర్యంలో దహనం చేశారు. ఎస్మాని ఉపసంహరించుకొని, కనీసవేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరికి టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మావతి, బృందమ్మ పాల్గొన్నారు.



లేపాక్షిలో ..



పెనుకొండలో..



పుట్టపర్తిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై అంజనీతండా సమీపం లో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మొరంపల్లికి చెందిన శ్రీనివాసులు(42) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు కూరగాయల వ్యాపారి. బాగేపల్లి మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా అంజనీతండా సమీపంలోకి రాగానే వెనుకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును బాగేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

నల్లచెరువు : మండల పరిధిలోని అల్లగుండు ఫ్లై ఓవర్ వద్ద శనివారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో మదనపల్లి-కదిరి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 50 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ లింగన్న సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద స్థలంలో పడిన అరటిపండ్ల ట్రేలను బట్టి గుర్తు తెలియని రవాణా వాహనం ఢీకొని ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహిళను గుర్తించిన వారు 94909 22418 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట జూదరుల అరెస్టు

లేపాక్షి : అందిన సమాచారం మేరకు ఆదివారం ఎస్ఐ గోపి, సిబ్బంది దాడులు చేసి మండల పరిధిలోని కొండూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 5,250 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకొంటామని ఎస్ఐ తెలిపారు.

నేడు నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి ప్రారంభం



పెనుకొండ : ఆధ్యాత్మిక వేత్త, షిర్డి సాయి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. సాయి కాళేశ్వర్ 51వ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని శివసాయి మందిరం ఆవరణలో నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రిని ప్రారంబిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఆసుపత్రిలో నిరంతరం సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి : స్థానిక జడ్పి హైస్కూల్‌లో 1999-2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో అప్పటి గురువులు, స్నేహితుల అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా చెన్నేకొత్తపల్లి కూడలి నుంచి స్కూల్ వరకూ గురువులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం గురువులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఒకరికొకరు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, యోగ క్షేమాలను పంచుకున్నారు. విశ్రాంత హెచ్ఎం ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, సరస్వతి, రాజశేఖర్, సురేష్, ఓబిలేసు, అశ్వత్తనారాయణరెడ్డి, వాలంటీర్ వీణ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

కదిరి టౌన్ : పట్టణంలోని వేమన బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నాటి విద్యార్థి అత్తార్ మహబూబ్‌బాషా అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా అప్పటి గురువులను, వారి భార్యలను శిష్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాటి గురువులు సుబ్బరాయుడు, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశులు, గంగిరెడ్డి, సిఎం రామచంద్రారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆత్మారెడ్డి, పూర్వ విద్యార్థులు ఎల్.రెడ్డి, రాజీవుల్లా, వేమనారాయణ, భాస్కర్‌రెడ్డి, అజంతుల్లాఖాన్, శివశంకర్‌రెడ్డి, ఎస్ఎండి బాషా, రామలింగయ్య, ఎమ్మెస్ పార్థసారథి, సి.రమేష్, పాల్గొన్నారు.

ప్రజల్లో రాజకీయ చైతన్యం రావాలి

పుట్టపర్తి అర్బన్ : ప్రజల్లో రాజకీయ చైతన్యం రావాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమని ప్రజాస్వామ్య హక్కుల సాధన ప్రతినిధి తలమర్ల మారుతిరెడ్డి తెలిపారు. స్థానిక సాయి ఆరాధనలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ప్రజలకు ఏం చేస్తాడో ముందుగానే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పాత అభ్యర్థులే పోటీ చేస్తే గతంలో ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారు, ఇప్పుడు ఏమి హామీలు ఇస్తారో ప్రకటించాలన్నారు. ప్రజలు మంచి అభ్యర్థికి ఓటు వేసి ఆ అభ్యర్థి హామీలు నెరవేర్చకుంటే నిలదీయాలన్నారు. అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా అమలవుతుందన్నారు. బావసారూప్యత గల వ్యక్తులతో కలిసి రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు విలువపై పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తాం : కాంగ్రెస్

కొత్తచెరువు : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని పుట్టపర్తి నియోజకవర్గ పార్టీ నాయకులు లాయర్ లక్ష్మీనారాయణ, వీరనారాయణ, మండల కన్వీనర్ బెల్లం నజీర్‌బాషా తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ నివాసంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే, హిందూపురం ఎంపి స్థానాలకు పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. గెలుపు కోసం పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీ పథకాలను కూడా మేనిఫెస్టోలో ప్రవేశపెడుతుందన్నారు. కార్యక్రమంలో షామీర్‌బాయ్, మోహన్, రామాంజి, కిష్టప్ప, ఇమ్రాన్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతలో 10న 'రాయలసీమ సింహగర్జన'

సోమందేపల్లి : బిసివై పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ అనంతపురం నగరంలోని రుద్రంపేట బైపాస్ పక్కన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్న 'రాయలసీమ సింహగర్జన' బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం బహిరంగ సభ కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, లక్ష్మీకాంత్, నరసింహమూర్తి, అంజి, నరేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు అందజేత

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధి లోని కాలసముద్రం గురుకుల పాఠశాలలో చదువు తున్న హ్యాండ్ బాల్ క్రీడాకారులకు ఆదివారం కదిరి హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో దాత శ్యాములు సహకారంతో 40 జతల దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ క్రీడాకారుల ను, క్రీడలను ప్రోత్సాహించేందుకే దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టిఎస్ఎన్ డిగ్రీ కళాశాల పిడి నరసింహాచారి, కదిరి హ్యాండ్ బాల్ సంఘం సెక్రటరీ మహేష్, కాలసముద్రం గురుకుల పాఠశాల పిడి కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి టౌన్ : ప్రజాశక్తి-2024 క్యాలెండర్‌ను ఆదివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల సమస్యలు, వాస్తవాలను సమాజానికి తెలియజేస్తూ ప్రజల పక్షాన పనిచేస్తుందని కొనియాడారు. ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విలేకరి హరి, టిడిపి నాయకులు మొపూరి శెట్టి చంద్రశేఖర్, రాజశేఖర్‌బాబు, రమణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన బాల బాలికల జట్టు

జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

హిందూపురం : లేపాక్షి గురుకుల పాఠశాలలో ఆదివారం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జూనియర్ బాలబాలికల హ్యాండ్ బాల్ జట్లను గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్, పిడిలు కుమార్, ప్రసాద్, నరేందర్, వేదవతి సమక్షంలో ఎంపిక చేశారు. **బాలికల జట్టు :** శారద, గీతాంజలి, సుస్మిత, జానకి, లలిత, గంగమ్మ, మీనాక్షి, బసమ్మ, నాగరత్న, హేమలత, నాగ హర్షిత, వర్షిత, జాహ్నవి, నికిత, చెర్రీ. **బాలుర జట్టు :** పునీత్‌కుమార్, మనోజ్‌కుమార్, సుదర్శన్, జస్వంత్‌కుమార్, జస్వంత్, జీవన్‌రెడ్డి, అభిషేక్, గంగాధర్, శశిధర్‌రెడ్డి, విహారి, వంశీ, వంశీకుమార్, ఏళ్ల మోహన్, అభిషేక్, నరేష్‌కుమార్, హరికృష్ణారెడ్డి. బాలుర జట్టు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని జిల్లా అధ్యక్షులు బలరామిరెడ్డి, కార్యదర్శి ముస్తఫా తెలిపారు.

జిల్లా స్థాయి చెకుముకి టెస్టులో 'రెయిన్‌బో'కు మొదటి స్థానం

ఓబుళదేవరచెరువు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హిందూపురంలోని దీప్తి స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌లో స్థానిక రెయిన్‌బో ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు మేఘనాథ్‌రెడ్డి, లయశ్రీ, యశ్వంత్‌నాయుడు ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపల్ ఎం.జయసింహారెడ్డి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

రొద్దం : మండల పరిధిలోని ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త హరిజన నరసింహులు అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా ఆదివారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట నాయకులు చంద్రమౌళి, నరసింహులు, మైలారప్ప, రెడ్డి వారి మంజునాథ్, గోబ్బరంపల్లి రవి, మహబాషా, లోచర్ల మురళి, చంద్ర ఉన్నారు.

మంత్రి ఉషశ్రీని కలిసిన ప్రేమ్

గోరంట్ల రూరల్ : రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఉషశ్రీచరణ్‌ను ఆమె నివాసంలో రెడ్డి జేఏసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, గోరంట్ల మండల యువజన నాయకులు ప్రేమ్ కుమార్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఉషశ్రీచరణ్‌కు మద్దతుగా యువతతో కలిసి వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బోయ వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, జడ్పిటిసి పాలే జయరామ్ నాయక్, కాలువ రాజారెడ్డి, నాగిరెడ్డి, ధనుష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం

తనకల్లు : మండల పరిధిలోని చీకటిమానుపల్లికి చెందిన రజక వెంకటరమణ బంకుకు ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు మీరాశి వేమనారాయణ ఆదివారం అతడికి రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు ఆంజనేయులు, సోంపాలెం నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తోపు ఫారెస్, మహబూబ్ బాషా, మల్లికార్జున, జె.రవి, బాలప్ప, సరోజమ్మ, శ్రీరాములు, వెంకటప్ప, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మీరాశి వేమనారాయణ

వైసిపి హయాం.. కబ్జాలు, అవినీతిమయం

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూరి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నియోజవకర్గంలో నాలుగున్నరేళ్లలో అభివృద్ధి అడ్రస్ లేకుండా పోయిందని, భూములు, ఇళ్లు, స్థలాలు మాత్రం కబ్జా అవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గాన్ని అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డాగా మార్చిన ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డికే దక్కుతుందన్నారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో జరిగిన దౌర్జన్యాలు, రౌడీయిజం, స్థానిక ఎమ్మెల్యే దోపిడీ, తదితర అరాచకాలను ఎండగట్టారు. 2014-19 మధ్య రూ. 3,400 కోట్లతో పనులు చేపట్టి నియోజకవర్గాన్ని అభివద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చగా, వైసీపీ పాలనలో అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదని,ఎమ్మెల్యే కేతిరెడ్డి మాత్రం ప్రజల రక్తాన్ని పీల్చి రూ. 4వేల కోట్లు అక్రమంగా సంపాదిం చారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే సిట్ ఏర్పాటుచేసి కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకొని ప్రజల పరం చేస్తామన్నారు. కొత్త ఇళ్లు నిర్మాణం, స్థలాల రిజిస్ట్రేషన్, వాహనాలు కొనుగోలు చేసినా ఆయనకు కప్పం కట్టాల్సిందే అన్నారు. వీటితో విసిగిపోయిన వైసిపి కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఎన్నికల్లో కేతిరెడ్డిని చిత్తుచిత్తుగా ఓడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే హంద్రీనీవా పనులను పూర్తి చేసి సాగు, తాగునీరు తీసుకొస్తాం.చేనేత క్లస్టర్ ఏర్పాటు చేసి పది వేల మంది కార్మికులకు ఉపాధి. మెడికల్ కాలేజ్ నిర్మాణం. సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు కృషి చేస్తానని గోనుగుంట్ల నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు నాయకులు డిష్ రాజు, తుంపర్తి పరమేష్, బోడగల గిరిధర్, దుస్సా క్రిష్ణ, నారాయణ స్వామి, దేవేంద్రనాథ్‌రెడ్డి, గొట్లూరు చంద్ర, రాము ఉన్నారు.

ఆపన్నులకు అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే

ఎవరు ఆపదలో ఉన్నా వారికి అండగా నిలిచి ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ భరోసా ఇచ్చారు. పట్టణంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించి రూ. 2 లక్షలకు పైగా సాయం అందజేశారు. ముందుగా స్థానిక కదిరి గేటు నుంచి గోనుగుంట్ల సూరి వాహనంలో బయల్దేరగా ఆ వాహనం ముందు అనుచరులు 30 బైకులతో ర్యాలీగా శివానగర్‌లోని శివాలయం వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మృతి చెందిన చౌడమ్మ, షేక్ మహబూబ్ బాషా, పోలా రామాంజనేయులు, నామా రామాంజనేయులు, బాలాజీ, చెన్నంశెట్టి సుబ్రమ్మ, లక్ష్మమ్మ, ప్రకాశ్, కె.శ్రీనివాసులు, సున్నపురాళ్ల కార్తీక్, తిమ్మప్ప, చేనేత కార్మికుడు వనం శ్రీనివాసులు, రమేష్ కుటుంబ సభ్యులకు రూ. 15వేల చొప్పున నగదు అందజేశారు. మల్లేనిపల్లి లక్ష్మీనారాయణ వైద్య ఖర్చులకు రూ. 10వేలు అందజేశారు. ఆయన వెంట డిష్ రాజు, తుంపర్తి పరమేష్, బోడగల గిరిధర్, దుస్సా క్రిష్ణ, సరితాల దస్తగిరి, గుండా పుల్లయ్య, చిలకం సూర్యనారాయణరెడ్డి, నారాయణ స్వామి యాదవ్, మైనార్టీ నాయకులు నబిరసూల్, మల్కాపురం హరి, నారాయణస్వామి, దేవేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.



మృతుని కుటుంబసభ్యులను ఆర్థిక సాయం చేస్తున్న సూరి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 'వైఎస్ఆర్ పెన్షన్ కానుక' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే మండల పరిధిలోని మేడాపురం, ఓబుళంపల్లి, చెన్నేకొత్తపల్లి, న్యామద్దెల సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, పార్టీలకతీతంగా వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేస్తూ అన్ని వర్గాలకు న్యాయం చేస్తోందన్నారు. టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫారసుతో పథకాలు మంజూరు చేసేవారని మండిపడ్డారు. తోపుదుర్తి, దేవరకొండ, ముట్టాల రిజర్వాయర్లను పూర్తిచేసి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పరిటాల సునీత అబద్ధాలు వల్లిస్తున్నారని వాటిని తిప్పికొట్టాలని ప్రజలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని మరోమారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అధికారులు, జెడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి, ఎంపీపీ మజ్జిగ అంజలి, సర్పంచి శ్రీరాములు, మండల కన్వీనర్ నర్సిరెడ్డి, నాయకులు నరసింహులు, సూరి, ప్యాదిండి నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి గెలుపే ధ్యేయంగా పనిచేయండి

పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయ శాంతి

కొత్తచెరువు : రాబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయ శాంతి పిలుపునిచ్చారు. ఆమె పార్లమెంట్ వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, నాయకులను కలిసి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆదివారం ఆమె కొత్తచెరువు వెళ్లగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సిఎం జగన్ ఎంపి అభ్యర్థిగా ప్రకటించారన్నారు. తన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహాలక్ష్మి, సూరి, వాల్మీకి శంకర్, అంగడి సత్తి, పెయింటర్ కేశవ, కృష్ణమూర్తి, అయూబ్ పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకత్వాన్ని బలపరచాలి

టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

కదిరి టౌన్ : రానున్న ఎన్నికల్లో కులం, మతం చూడకుండా సమర్థవంతమైన నాయకత్వాన్ని బలపరచాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని కందికుంట నివాసంలో ఆదివారం నంబులపూలకుంట మండలం కొత్తపల్లి, వడ్డిపల్లికి చెందిన పలువురు వైసిపి నాయకులు, వార్డ్ మెంబర్లు టిడిపిలో చేరగా కందికుంట వారికి పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. కందికుంట మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, అన్ని రంగాలు నిర్వీర్యం అయ్యాయని, పంచాయతీలను సర్వ నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి రాక్షస పాలనను అంతమొందించాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజనప్పనాయుడు, చంద్రశేఖర్ నాయుడు, రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

అట్టహాసంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

రొద్దం : సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక టింబక్టివ్ కలెక్టివ్ కార్యాలయంలో ఆదివారం బాలికలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. కోఆర్డినేటర్ రామన్న మాట్లాడుతూ పూర్వం సంక్రాంతి పండుగకు కొత్త ధాన్యం చేతికంది రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారన్నారు సంక్రాంతి సంప్రదాయాలు కనుమరుగువుతున్న తరుణంలో ఈ తరానికి గుర్తు చేయడానికి ఈ కార్యక్రమం నిర్వంచినట్లు తెలపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అనంతశక్తి సిఇఒ లావణ్య, మాధవి, నరసింహులు, శిరీష, మోహన, రాధికా, బాలికలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరిక

మడకశిర : మండల పరిధిలోని కదిరేపల్లి పంచాయతీ గుర్రపుకొండతండాకు చెందిన వైసిపి నాయకులు లోకేష్, సుబ్బనాయక్, లక్ష్మీనరసప్ప, కదిరేపల్లి ట్రాక్టర్ లోకేష్‌తో పాటు 15 కుటుంబాలు ఆదివారం టీడీపీలోకి చేరారు. వారికి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనివాస్, రంగనాథ్, కట్టా కిషోర్, తిమ్మరాజు, ఈశ్వర్, రవికుమార్, సోము, నాగ, తిప్పేనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ప్రత్యక్ష ఆందోళనలు

ఎస్ఎఫ్ఐ హెచ్చరిక

హిందూపురం : సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు కూడా సెలవులు ప్రకటించాలన్నారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని, దానికి విద్యాశాఖ అధికారులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, నిహాల్, భగత్, అభి, వినోద్, గురు, బాబాఫకృద్దీన్, హేమంత్ పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిలకు భరోసా

ప్రజాశక్తి-మడకశిర

టిడిపితోనే బిసిల భవిష్యత్తుకు భరోసా అని ఆ పార్టీ రాష్ట్ర కుంచితి ఒక్కలిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప తెలిపారు. రొళ్ల మండలం ఎం.రాయపురం గ్రామపంచాయతీ పరిధిలోని బంద్రేపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'బిసిల భరోసా బాట' కార్యక్రమానికి పాండురంగప్ప ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'టిడిపి అంటే బిసిలు.. బిసిలు అంటే టిడిపి' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బిసిల భరోసా బాట నిర్వహిస్తున్నామన్నారు. సైకో జగన్ ప్రభుత్వం బిసిలను ఎలా వేధించింది, అన్యాయం చేసింది అనే దానిపై కరపత్రాల ద్వారా బిసిలకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాలూకా రైతు ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప, డైరీ నర్సాగౌడ్, నాయకులు ఎస్.తిమ్మప్ప, బండి రమేష్, కెంపన్న, జయలక్ష్మమ్మ, తిమ్మక్క, రత్నమ్మ, తెంపమ్మ, లలితమ్మ, తిమ్మక్క, రఘునాథప్ప, చంద్రప్ప, నాగరాజు, నారాయణప్ప, హనుమంతరాయప్ప, లక్ష్మప్ప, రామప్ప, రంగనాథప్ప, గీతమ్మ, జయలక్ష్మమ్మ, అశ్వత్తనారాయణ పాల్గొన్నారు



బిసి భరోసా బాట నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

పుట్టపర్తి టిడిపి టికెట్ కాపులకు కేటాయించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి అసెంబ్లీ టికెట్ కాపులకు కేటాయించాలని ఆదర్శ విద్యాసంస్థల అధినేత పెదరాసు సుబ్రహ్మణ్యం ఆదివారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుని కలిసి విన్నవించారు. ముందుగా ఆయన అచ్చెన్నాయుడుని శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పుట్టపర్తి టికెట్ ఇస్తే విజయం సాధిస్తామన్నారు. హిందూపురం పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర కాపు(బలిజ) సంఘాల జెఎసి నాయకులు కూడా సుబ్రహ్మణ్యంకు టికెట్ కేటాయించాలని కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో గుంటూరు నాయకులు లక్ష్మీనారాయణచౌదరి, లాయర్ కిరణ్, బండమీద ఈశ్వరప్ప పాల్గొన్నారు.



టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుని సన్మానిస్తున్న పెదరాసు సుబ్రహ్మణ్యం

నిరుపేదల కోసమే కంటి వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కంటి సమస్యలు ఎదుర్కొంటున్న నిరుపేదల కోసమే యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తూ నిరుపేదల కంటి సమస్యలకు చికిత్స అందిస్తున్నామన్నారు. శిబిరంలో 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారని, వారందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు చాంద్ బాషా, పోలా ప్రభాకర్, బండి నాగేంద్ర, సుకుమార్, రాధాకృష్ణ, కోటేశ్వరరావు, నాగార్జున, నామాల శ్రీనివాసులు, ఒవి ప్రసాద్, బిఆర్ రంగనాథ్, చలపతి, రమేష్ పాల్గొన్నారు.